బాధితుడికి పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రూనాయక్

కురవి, ఫిబ్రవరి 4: మండలంలోని రేకుల తండా గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బానోత్ ప్రతాప్‌నాయక్‌ను ఆదివారం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రూనాయక్ పరామర్శించారు. అనంతరం ఆయన వెంట ఉన్న గ్రామనాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సారెస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం, రాంచంద్రాపురం నుంచి తిర్మలాపురం గ్రామం వరకు బీటీ రోడ్డు వంటి పనులను వచ్చే బడ్జెట్‌లో మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు లాలనాయక్, సీనియర్ గ్రామ నాయకులు లింగ్యా నాయక్, కృష్ణారావు, బానోత్ బాలానాయక్, తిప్పర్తి వీరభద్రం, గుగులోత్ రాములు, రమేశ్, బానోత్ బాబురావు, అంజయ్య, మండల నాయకులు మోహన్‌రావు, ఈర భద్రం, బాలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 4: రెగ్యులర్ కాకుండా మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగల నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు, ఎస్సీ ఎస్టీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలో మంత్రి కొండా సురేఖను కలిశారు. ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో అనేక మంది కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ కాకుండా మిగిలిపోయారని, జనరల్ కళాశాలల్లో 25 మంది, ఒకేషనల్ కళాశాలల్లో 411 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్ కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి వారి సర్వీసులను క్రమబద్ధీకరించి ఆదుకోవాలని కోరారు. అధ్యాపకుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాచర్ల కరుణాకర్, జనార్దన్, నాయకులు బన్న ఐలయ్య, భూక్యా రాజు, కిషన్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

బయ్యారం ఉక్కు పరిశ్రమకు ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయించని కేంద్ర సర్కారు

- పార్లమెంటు ఎన్నికల వేళ ఆశగా ఎదురు చూసిన జిల్లా ప్రజానీకం
- విభజన హామీకి పదేళ్లుగా తూట్లు పొడుస్తున్నారని ఆగ్రహం
- ఉపాధి విషయంలో మరోమారు యువతకు నిరాశ
- స్టీల్ ప్లాంట్ విషయంలో స్పష్టంకాని కాంగ్రెస్ వైఖరి

మళ్లీ నిరాశే..


బయ్యారం గుట్ట, (ఇన్‌సెట్) అడవుల్లోని ఇనుప ఖనిజం

బయ్యారం, ఫిబ్రవరి 4 : బయ్యారం ఉక్కు పరిశ్రమ విషయంలో తెలంగాణ ప్రజానీకానికి మరోసారి నిరాశ తప్పలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బయ్యారంలోని వేల కోట్ల రూపాయల విలువ చేసే ఇనుప ఖనిజాన్ని సమైక్య పాలకులు అప్పనంగా ఆంధ్రా ప్రాంతానికి తరలించి తెలంగాణ వనరులను దోచుకున్నారు. దీంతో 'బయ్యారం ఉక్కు – తెలంగాణ హక్కు' అనే నినాదంతో బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాలు చేపట్టి ఖనిజ తరలింపునకు అడ్డుకట్టవేసింది. అంతేకాకుండా 2014లో కేంద్రంలో అధికారంలో కాంగ్రెస్ సర్కారు బయ్యారంలో ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నది. ఆర్టికల్ – 13లో రూ.30 వేలకోట్లతో సెయిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ పరిశ్రమ నిర్మించేలా రూపొందించిన బిల్లు కూడా నాడు పార్లమెంటులో ఆమోదం పొందింది. అయితే, చట్టబద్ధంగా లభించిన హామీని నెరవేర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏండ్లుగా బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తడం లేదు. కాలయాపన చేస్తూ పబ్బం గడుపుతున్నది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనుండడంతో ఈ సారి బడ్జెట్‌లోనైనా బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం నిధులు కేటాయిస్తారని తెలంగాణ ప్రజలు ఆశగా ఎదురుచూశారు. ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 సంవత్సరానికి రూ.47.66లక్షల కోట్లతో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టి, అన్ని రంగాలకు నిధులు కేటాయించారు.. కానీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసెత్తలేదు. కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఈ సారి తప్పకుండా ఉక్కు పరిశ్రమ కోసం నిధులు కేటాయిస్తారని అందరూ భావించినా మరోమారు భంగపాటు తప్పలేదు. ముఖ్యంగా పరిశ్రమ నిర్మిస్తే ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని యువత భావించినా మళ్లీ నిరాశే మిగిలింది. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బైలడిల్లా గనులను పోస్కో, అదానీ గ్రూప్ కంపెనీలు కేటాయించిన ప్రధాని తన సొంత రాష్ట్రం గుజరాత్‌లోని ముంద్రలో రూ.37,500కోట్లతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు గతేడాది ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ప్రచారం జరుగుతున్నది.

స్టీల్ ప్లాంట్ కోసం కాంగ్రెస్ ఉద్యమించేనా...?

నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ హయాంలోనే బయ్యారం ఉక్కు పరిశ్రమకు చట్టబద్ధంగా ఆమోదం లభించింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ కోసం పలు సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది. గత ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ అనేకమార్లు ప్రధాని మోదీతోపాటు కేంద్ర ఉక్కు శాఖ మంత్రులకు పరిశ్రమ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వినతి పత్రాలు అందజేశారు. బయ్యారం వేదికగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఎంపీ కవిత నిరాహార దీక్షలు, ఆందోళనలు చేశారు. కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఇంత వరకు కనికరించలేదు. అయితే, ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఉక్కు పరిశ్రమ విషయంలో ఇప్పటివరకు తన వైఖరిని వెల్లడించలేదు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని నాడు బిల్లులో పేర్కొన్న కాంగ్రెస్ పార్టీపై ఆ హామీని నెరవేర్చాల్సిన బాధ్యత కూడా ఉన్నది. కాగా, త్వరలో పార్లమెంట్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కాంగ్రెస్ వైఖరి ఏమిటనేది చర్చనీయంగా మారింది.

ఖనిజం ఫుల్..,

బయ్యారం పరిసర ప్రాంతాల్లోని అడవుల్లో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో 1,41,691ఎకరాల్లో (5690 హెక్టార్లు) ఇనుప ఖనిజం ఉండగా, అందులో 44వేల హెక్టార్లు జిల్లాలో ఉంది. కేవలం బయ్యారం మండల అటవీ ప్రాంతంలో 25,700 హెక్టార్లలో 3.40లక్షల మెట్రిక్ టన్నులు 60 నుంచి 70శాతం నాణ్యత కలిగిన ఖనిజం ఉందని అనేక సర్వే సంస్థలు వెల్లడించాయి. ఇక్కడ ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే వేలాది మంది యువతకు ఉపాధి లభించడంతోపాటు పరోక్షంగా వేల కుటుంబాలు జీవనోపాధిని పొందుతాయి. తద్వారా జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది. బయ్యారం ఉక్కు పరిశ్రమతో బహుళ ప్రయోజనాలున్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది.

మార్చి 3న ఎమ్మెల్యేలకు సన్మాన సభ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : జిల్లాలో గెలుపొందిన ఎమ్మెల్యేలకు లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వచ్చే నెల 3న సన్మాన సభ ఉంటుందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేశామన్నారు. సన్మాన సభకు రాష్ట్ర మంత్రులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తామని, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి కేంద్రీయ విద్యాలయ పేంట్ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. 2015లో ఓ ఎస్టీ హాస్టల్ భవనంలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారని, క్లాస్ రూమ్‌లు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే నూతన భవనం నిర్మించాలన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయ స్థానం

కేసముద్రం, ఫిబ్రవరి 4: మండలంలోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు చెకుముకి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులో ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 3న మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో పాఠశాలకు చెందిన హర్షిని, సయ్యద్, ఓంసాయి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు ఇమ్మిరెడ్డి సురేందర్ రెడ్డి, విద్యార్థులు అభినందించారు.

క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమైంది

పెద్దవంగర, ఫిబ్రవరి 4 : క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమైందని, తొలిదశలోనే గుర్తించి వైద్యం పొందితే పూర్తి నయమవుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర అధ్యక్షుడు ఎదునూరి శ్రీనివాస్, కోశాధికారి ఎం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ప్రజలను చైతన్యం చేయడానికి రూపొందించిన కరపత్రాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యాన్సర్‌తో మరణాలు ఏటేటా పెరుగుతున్నాయని, ప్రతి ఐదుగురిలో నలుగురికి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ అవుతుందన్నారు. మొదటి దశలో గుర్తించకపోవడం వలన సుమారు 11 లక్షల మంది వ్యాధితో మృతి చెందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందన్నారు. ఆహార అలవాట్లు, మద్యపానం, ధూమపానం, వాయు కాలుష్యం, పరిసరాల శుభ్రత లేకపోవడం, స్త్రీలలో రొమ్ము క్యాన్సర్‌తో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో మండలంలో క్యాన్సర్ నిపుణులైన పది మంది డాక్టర్లతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ చెకప్ క్యాంపు నిర్వహిస్తున్నామని, తొలిదశలోనే గుర్తించడానికి ఈ క్యాంపు దోహదపడుతుందన్నారు. క్యాంపు తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్, పాల్గొన్న ముదిరాజులు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

కేసముద్రం, ఫిబ్రవరి 4 : ముదిరాజులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు చేయాలని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో విశిష్ట అతిథి నీలం దుర్గేశ్‌ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజులకు రిజర్వేషన్ ఫలాలు అందక విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు రావడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ –డీలో ఉన్న ముదిరాజులను బీసీ –ఏలోకి మార్చాలని కోరారు. ముదిరాజులు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, దుండి అశోక్, చిరుత వెంకటేశ్వర్లు, జెనిగల అనిల్, అరిగె విజేందర్, చాగంటి శ్రీనివాస్, సింగని ప్రభాకర్, సిరికొండ భాస్కర్, దొంతరబోయిన నరేశ్, గుండెల అనిల్ పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల నల్లబెల్లం

డోర్నకల్, ఫిబ్రవరి 4 : అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను ఆదివారం డోర్నకల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సంతోష్‌రావు కథనం ప్రకారం.. డోర్నకల్ ఎస్సీ బీసీ కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. అందులో 35 క్వింటాళ్ల నల్లబెల్లం (75 బస్తాలు), రెండు క్వింటాళ్ల పటిక (4 బస్తాలు)ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనంలోని పరమేశ్వర్, శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.., గుంటూరు నుంచి డోర్నకల్‌కు బెల్లం, పటిక తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని బెల్లం, పటిక, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మిరపకాయలు, కోళ్లు చోరీ

డోర్నకల్, ఫిబ్రవరి 4 : మిరపకాయలు, కోళ్లు అపహరణకు గురైన ఘటన శనివారం రాత్రి మండలంలోని ముల్కలపల్లిలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం... ముల్కలపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కల్లంలో ఆరబోసిన క్వింటాలు మిరప కాయలు, మొలాలికి చెందిన సుమారు వంద కోళ్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వెంకటేశ్వర్లు, మొలాలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జయంత్యుత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 : జిల్లా వ్యాప్తంగా ప్రతి తండాలో ఈ నెల 14న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న కోరారు. ఆదివారం పట్టణంలోని మార్వాడీ సత్రంలో జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ అధ్యక్షతన జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు కేటాయించ లేదని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోతీలాల్‌నాయక్, పద్మబాయి, వినోద్‌నాయక్, రాంబాబు, సురేశ్, దిలీప్, బాలాజీ, దేవేందర్, కల్యాణ్ పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

తొర్రూరు, ఫిబ్రవరి 4: సాంఘిక సంక్షేమ గురుకులాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 576 మందికి గాను 561 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ఆర్వీవో కే ప్రత్యూష తనిఖీ చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ జయశ్రీ, తహసీల్దార్ వినోద్ కుమార్, ఎస్సై జగదీశ్ తదితరులు ఉన్నారు.

రైల్వే ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

కేసముద్రం, ఫిబ్రవరి 4: రైలు కిందపడి మృతి చెందిన రైల్వే ఉద్యోగి పాండు కుటుంబానికి రైల్వే శాఖ ఆధ్వర్యంలో రూ.35వేల ఆర్థిక సాయం అందజేశారు. పాండు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రైల్వే శాఖ నుంచి రూ.25 వేలు, సీసీఎస్ నుంచి మంజూరైన రూ.10వేలను మృతుడి భార్యకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రాజ మౌళి, మజ్దూర్ యూనియన్ సెక్రటరీ యుగేంధర్ యాదవ్, వైస్ చైర్మన్ భాస్కరరావు, జే ఈ సురేశ్, సుధాకర్, వంశీ, రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న రైల్వే ఉద్యోగులు

బాధిత కుటుంబానికి పరామర్శ

దంతాలపల్లి, ఫిబ్రవరి 4: మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన తీగల పుల్లయ్య మృతి చెందారు. ఆదివారం జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేశారు. దాట్ల గ్రామానికి చెందిన ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఎంజీఎం దవాఖానలో పొందుతుండగా, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.


కుటుంబ సభ్యులను తపరామర్శిస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

SERVICE

లోన్స్

★SBI లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త.. ఎటువంటి సమస్యలున్న Solve చేసి అన్ని రకాల లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్: 9493910808.
NTW-321488

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107

CHANGE OF NAME

I, BANDA PRABHAKER REDDY (Old Name), S/O. BANDA SRINIVAS REDDY, R/o. H.No. 3-146, Ananthasagar Village, Hasanparthy Mandal, Hanumakonda Dist.- 506371, T.S., India. have Changed My Name as BANDA PRABHAKAR REDDY (New Name), S/o. BANDA SRINIVAS REDDY and solemnly declare.

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

డోర్నకల్, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల వీరస్వామి అన్నారు. తెల్లబండ తండాలో ఆయన మాట్లాడుతూ... పాత పెన్షన్ విధానాన్ని వెంటనే ప్రకటించాలని అన్నారు. బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టడంతో పాటు ప్రతి పాఠశాలలో అటెండర్‌ను నియమించాలన్నారు.

పార్టీ సభ్యత్వం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

సీపీఐలో చేరిక

గార్ల, ఫిబ్రవరి 4: మద్దివంచ మాజీ ఉప సర్పంచ్ లావుడ్యా భీముడు న్యూడెమోక్రసీ పార్టీ నుంచి ఆదివారం మద్దివంచ గ్రామంలో పార్టీ కార్యాలయంలో సీపీఐ పార్టీలో చేరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ సభ్యత్వం రసీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, ఫిబ్రవరి 4: విలేజ్ జడ్పీ హైస్కూల్‌లో 2005–06లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్త జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాజిటివ్ దృక్పథంతో మెలగాలని, అదే జీవితంలో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో బైరబోయిన అశోక్, గుండు శ్రీకాంత్, అల్వాల కుమార్, దాసరి కుమార్, చక్రధర్, గణేశ్, మైబెల్లి, పెసర కాసీం, ఆరెందుల నరేశ్, ఆకుతోట వెంకటేశ్వర్లు, రాసాల అశోక్, నాగెల్లి శ్రీనివాస్, మాసాడి సంతోష్, వేముల సుధాకర్, డొనికల రాజు పాల్గొన్నారు.

అటవీ శాఖలో ఎన్నికల సందడి

- పోటాపోటీ జూనియర్ ఫారెస్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు
- ఇప్పటికే యూనిట్ స్థాయి ఎన్నికలు పూర్తి
- ఆసక్తి రేపుతున్న రాష్ట్ర కమిటీ అధ్యక్షుడి ఎన్నిక
- ఉమ్మడి వరంగల్ నుంచి పోటీలో సాంబూనాయక్

వరంగల్, ఫిబ్రవరి 4 (నమస్తేతెలంగాణ): అటవీ శాఖలో ఎన్నికల సందడి నెలకొంది. కొద్దిరోజుల నుంచి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. ముసుపెన్నడూ లేని రీతిలో ఈసారి ప్రాధాన్యం సంతరించుకుంది. వరంగల్ నుంచి కొండా సురేఖ రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తుండడమే ఇందుకు కారణం. అటవీ శాఖలో కీలకమైన జూనియర్ ఫారెస్టర్స్ అసోసియేషన్ ఎన్నికలు మూడేళ్లకోసారి జరుగుతున్నాయి. ఈ శాఖలో జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల ఎన్నికల్లో ప్రతిసారి తీవ్ర పోటీ ఏర్పడుతున్నది. యూనిట్, రాష్ట్రస్థాయిలో యూనియన్లు తమ ప్యానల్ గెలుపు కోసం తలపడుతున్నాయి. ఇప్పటికే యూనిట్ స్థాయిలో జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ముగిశాయి. అటవీ శాఖలోని భద్రాద్రి జోన్‌లోగల యూనిట్ల ఎన్నికలు కొద్ది రోజుల క్రితం ప్రశాంతంగా ముగిశాయి. ఈ జోన్‌లో వరంగల్–హనుమకొండ, మహబూబాబాద్‌తోపాటు ఇల్లెందు, ఖమ్మం, మణుగూరు, పాల్వంచ, కొత్తగూడెం యూనిట్లు ఉన్నాయి. వరంగల్–హనుమకొండ యూనిట్ జూనియర్ ఫారెస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జవహర్, కార్యదర్శిగా ధర్మ, కోశాధికారిగా సంతోష్ ఎన్నికయ్యారు. ఒక ఉపాధ్యక్ష పదవి కోసం తీవ్రస్థాయిలో పోటీ జరిగింది. మహబూబాబాద్ యూనిట్ అధ్యక్షుడిగా డిప్యూటీ రేంజ్ అధికారి సాంబూనాయక్ ఎన్నికయ్యారు. కాళేశ్వరం జోన్‌లోని ములుగు–తాడ్వాయి యూనిట్, ఏటూరునాగారం–వాజేడు యూనిట్లకూ తా జాగా ఎన్నికలు జరిగాయి. చివరగా ఆదివారం భూపాలపల్లి యూనిట్ ఎన్నికలు హోరాహోరీగా ముగిశాయి. దీంతో భద్రాద్రి, కాళేశ్వరం జోన్లలో యూనిట్ స్థాయిలో జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ముగిసినట్లు అటవీ శాఖలోని యూనియన్లు వెల్లడించాయి. ఈ నెల 10, 11న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది.